సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ׀ 9 ׀ ఆగస్టు ׀ 2025




**చీనీ టన్ను రూ.15 వేలు**
అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.37**
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.37, కనిష్టంగా రూ.27 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,300 టన్నుల టమాట వచ్చింది.

**గరిష్టం/కనిష్టం**
**34.2°/21.6°**
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### 14 గ్రామాలకు రాకపోకలు బంద్



వర్షాలకు తెగిపోయిన ఈదుల వంక బ్రిడ్జి

**ముదిగుబ్బ:** ఇటీవల కురిసిన వర్షాలతో ఈదుల వంకలో నీరు పారుతోంది. ముదిగుబ్బ–మల్లేపల్లి మధ్య నిర్మించిన ఈదులవంక బ్రిడ్జి తెగిపోవడంతో శుక్రవారం 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన వారు.. మరో మార్గంలో 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం వర్షాలకు ఈ బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అధికారులు బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. దీంతో బ్రిడ్జి తెగిపోయి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గుర్తు తెలియని యువకుడి హత్య

- చెరువులో పడేసిన దుండగులు
- మారాల గ్రామంలో ఘటన



గుర్తు తెలియని యువకుడి మృతదేహం

**పుట్టపర్తి అర్బన్:** ఓ యువకుడిని హత్య చేసి తలకు ప్లాస్టిక్ సంచి చుట్టి.. చేతులు కట్టేసి చెరువులో పడేశారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. బుక్కపట్నం పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మారాల గ్రామ చెరువు నుంచి శుక్రవారం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పరిశీలించారు. వారికి ఓ మృతదేహం కనిపించగా.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి తన సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. 3 రోజుల క్రితమే ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సంచిలో చుట్టి తీసుకువచ్చి మారాల చెరువులో పడేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి ఒంటిపై మొలతాడు, చేతికి రాగి కడియం మాత్రం ఉన్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు... పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి కోరారు.

# అమ్మానాన్న కావాలి



అమితమైన ప్రేమ అమ్మ. అంతులేని అనురాగం అమ్మ. అమ్మ ప్రాణం పోసి జీవమిస్తే.. ఆ ప్రాణానికి ఓ రూపు ఇచ్చి వ్యక్తిగతంగా వృద్ధిలోకి తెచ్చే వ్యక్తి నాన్న. ఈ ఇద్దరికీ దూరమై ఎంతోమంది చిన్నారులు అనాథలుగా మారిపోతున్నారు. అల్లారుముద్దుగా పెరగాల్సిన వారు దిక్కుమొక్కులేకుండా జీవిస్తున్నారు. అలాంటి వారు తమకూ అమ్మానాన్న కావాలని, అందరి పిల్లల్లా తామూ వారి ప్రేమకు నోచుకోవాలని ఎదురుచూస్తున్నారు.

- దత్తత కోసం అనాథ చిన్నారుల ఎదురుచూపులు
- చట్టప్రకారం జరిగితేనే దత్తత హక్కులు వర్తిస్తాయి
- బిడ్డను దత్తత ఇవ్వాలంటే తల్లిదండ్రుల సమ్మతి ఒక్కటే సరిపోదు
- ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా ఇచ్చినా దత్తత హక్కులు వర్తించవు



**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనాథ పిల్లలు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివాహేతర సంబంధాల కారణంగా చాలామంది గర్భం దాల్చడం, ప్రసవం కాగానే ముళ్లపొదల్లోనో, నిర్మానుష్య ప్రదేశాల్లోనూ పసికందులను వదిలి వెళుతున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. పేగు బంధాన్ని కాదనుకుని సమాజానికి భయపడి చేస్తున్న ఈ ఘటనలు కలచి వేస్తుంటాయి. కానీ ఇలాంటి పిల్లలను అక్కున చేర్చుకునేందుకు దత్తతకు ముందుకు రావాలనేది అందరి అభిప్రాయం.

**దత్తత చట్టప్రకారమే జరగాలి..**
దత్తత అనేది పుట్టగానే ఎవరి బిడ్డనో ఆ తల్లిదండ్రుల సమ్మతితో తెచ్చుకున్నంత మాత్రాన సరిపోదు. చట్ట ప్రకారమే జరగాలి. దత్తత కావాలనుకునే తల్లిదండ్రులు తమ పాన్‌కార్డు ద్వారా www.cara. nic. in (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం దంపతులు పాన్‌కార్డు, ఆదాయ, వయస్సు, నివాస, వివాహ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాటు దంపతుల ఫొటో వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ అప్‌లోడ్ చేసిన తర్వాత ఏజెన్సీకి రూ.6 వేలు డీడీ సమర్పించాలి. ఇవన్నీ పూర్తయ్యాక 48 గంటల లోగా దంపతుల మొబైల్‌కు సమాచారం వస్తుంది. అనంతరం ఏజెన్సీకి వెళ్లి బిడ్డను రిజర్వు చేసుకోవచ్చు.

**బిడ్డ నచ్చిన తర్వాత..**
బిడ్డ నచ్చిన తర్వాత రిజర్వు చేసుకొని, రూ.40 వేలు ఏజెన్సీకి చెల్లించాలి. అన్ని ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాత బిడ్డను అప్పగిస్తారు. బిడ్డను పొందిన వారం రోజుల్లోగా దత్తతకు వచ్చిన డాక్యుమెంట్లన్నీ స్థానిక ఫ్యామిలీ కోర్టు లేదా జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించి దత్తతకు అధికారిక ఉత్తర్వులు పొందే అవకాశం ఉంటుంది. శిశుగృహతో పాటు సీసీఐ (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్)లో ఉన్న వారినీ దత్తత చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో శిశుగృహలు, బాలల సంరక్షణ సంస్థ(సీసీఐ)ల్లో ఉంటున్న దాదాపు వంద మంది చిన్నారులు దత్తత కోసం ఎదురుచూస్తున్నారు.

**రెండేళ్ల పాటు బిడ్డ పరిశీలన..**
దత్తత తీసుకున్న దంపతులు బిడ్డను తీసుకెళ్లాక.. దత్తత ఏజెన్సీకి చెందిన ప్రతినిధి రెండేళ్ల పాటు బిడ్డను ప్రతి ఆరు మాసాలకోసారి పరిశీలిస్తారు. బిడ్డకేమైనా ఇబ్బందులున్నాయా, తల్లిదండ్రులు సరిగా చూసుకుంటున్నారా లేదా ఇవన్నీ పరిశీలించి జాతీయ దత్తత ఏజెన్సీ 'కారా'కు సమర్పిస్తారు.

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో దత్తత ఇలా..**

| | |
|---|---|
| **ఇండియాలోని వివిధ రాష్ట్రాలకు** | |
| అబ్బాయిలు | 48 |
| అమ్మాయిలు | 75 |
| మొత్తం | 123 |
| **విదేశీయులు దత్తత తీసుకున్నది** | |
| అబ్బాయిలు | 1 |
| అమ్మాయిలు | 8 |
| మొత్తం | 9 |
| దత్తత కోసం వేచి ఉన్న దంపతులు | 73 |
| ఏటా దత్తత కోసం వచ్చే దరఖాస్తులు | 25 |

**శిశువుల పట్ల ఔదార్యం ఉండాలి**



ఎంతోమంది అనాథ చిన్నారులు ఆసరా కోసం ఎదురుచూస్తున్నారు. చాలామంది సంతానం లేని జంటలు ఇలాంటి బిడ్డలను దత్తత తీసుకుని తల్లిదండ్రులు కావచ్చు. సంతానం లేకపోవడం శాపం కాదు.. దత్తత చేసుకోవడం ఒక వరం. శిశువుల పట్ల ఔదార్యం కలిగి ఉండాలి.
– తరిమెల రమణారెడ్డి, అమ్మ ట్రస్ట్ చైర్మన్

● **రావమ్మా మహాలక్ష్మీ..**



అలంకరణలో మడకశిర లక్ష్మీనిడిమామిడమ్మ

**పుట్టపర్తి టౌన్:** శ్రావణ మాసం రెండో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి ఆలయాల ఎదుట బారులు తీరి పూజలు చేశారు. అనంతరం ఇళ్లకు మంగళ తోరణాలు కట్టి శ్రావణ లక్ష్మిని ఆహ్వానించారు. అమ్మవారి విగ్రహాన్ని పూలు, పండ్లు, ఆభరణాలు, నాణేలు, కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు. పూజకు విచ్చేసిన ముత్తయిదువులకు పసుపు, కుంకుమతో వాయినాలు సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో ధర్మవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి

# అధిక వర్షాలతో టమాటకు చేటు

- నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం



మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన టమాట

**అనంతపురం అగ్రికల్చర్:** లాభాల దిశగా సాగుతున్న టమాట ధరలకు ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలు చేటు తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. టమాట నాణ్యత తగ్గితే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 8 వేల హెక్టార్ల విస్తీర్ణంలో టమాట సాగులో ఉంది. జూలై మొదటి వారం నుంచి అనంతపురం మండలం కక్కలపల్లి మండీలో మార్కెటింగ్ మొదలైంది. కిలో రూ.25 ప్రకారం మొదలైన ధరలు ఈ నెల ఆరో తేదీ నాటికి గరిష్ట ధర రూ.47కు చేరుకుంది. ఒకట్రెండు రోజుల్లో రూ.50 మార్క్‌కు చేరుకుంటుందని భావించగా.. వర్షాల ఎఫెక్ట్‌తో శుక్రవారం కిలో రూ.37కు తగ్గిపోయింది. జూలై నెలంతా 15 కిలోల బాక్సు కనిష్టం రూ.300 నుంచి గరిష్టంగా రూ.700 వరకు పలకడంతో రైతులు కొంతవరకు లాభాల బాట పట్టారు. ఆగస్టు, సెప్టెంబర్ వరకు ఇదే పరిస్థితి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. దీంతో రైతులు సంబరపడ్డారు. అయితే నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది. తెరపినివ్వకుండా వర్షాలు పడితే ఎగుమతులు తగ్గే పరిస్థితి ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాయ తడిచి, మచ్చ వస్తే మార్కెట్‌లో 'నో సేల్' కింద ట్రేడర్లు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. అలాంటి సమస్యలు రాకుండా జిల్లా యంత్రాంగం, ఉద్యానశాఖ, మార్కెటింగ్‌శాఖ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# విస్తారంగా వర్షాలు



మార్లపల్లి వద్ద సాగైన వేరుశనగ పంట

- తుపాను ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు
- కోలుకుంటున్న ఖరీఫ్ పంటలు

**పుట్టపర్తి అర్బన్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు నెలలుగా మోస్తరు వర్షం కూడా లేక ఎండుముఖం పట్టిన ఖరీఫ్ పంటలు కాస్త తేరుకుంటున్నాయి.

**6 రోజుల్లో 68.7 మి.మీ సగటు వర్షపాతం**
అల్పపీడనం ప్రభావంతో ఈనెల 3వ తేదీ ఆదివారం జిల్లాలోని 2 మండలాల పరిధిలో 1.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అలాగే 4వ తేదీ సోమవారం 18 మండలాల్లో 6.9 మి.మీ, 5వ తేదీ మంగళవారం 31 మండలాల్లో 29.6 మి.మీ, 6వ తేదీ బుధవారం 29 మండలాల్లో 16.6 మి.మీ, 7వ తేదీ గురువారం 2 మండలాల్లో 0.7 మి.మీ, 8వ తేదీ శుక్రవారం 18 మండలాల పరిధిలో 13.1 మి.మీ సగటు చొప్పున 6 రోజుల్లోనే 68.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. దీంతో ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన ఉద్యాన పంటలు, పూలతోటలు, మెట్ట భూముల్లో సాగుచేసిన వేరుశనగ, కంది, జొన్న తదితర పంటలు కోలుకుంటున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**63,226 హెక్టార్లకు చేరిన సాగు విస్తీర్ణం**
ఖరీఫ్ సాగు విస్తీర్ణం 2,19,022 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకూ 63,226 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో అత్యధికంగా వేరుశనగ 35,097 హెక్టార్లు, కంది 11,586 హెక్టార్లు, రాగి 690 హెక్టార్లు, మొక్కజొన్న 8,910 హెక్టార్లు, వరి 720 హెక్టార్లు, జొన్న 230 హెక్టార్లు, పత్తి 3391 హెక్టార్లు, ఆముదం 2,379 హెక్టార్లలో సాగులోకి వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్య కావడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. అందుకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ సారి ఉలవలు, పెసర, అలసంద, జొన్న తదితర విత్తనాలు సబ్సిడీతో అందజేస్తామన్నారు.

**18 మండలాల్లో వర్షం**
గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని 18 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా నల్లమాడ మండలంలో 50 మి.మీ, లేపాక్షి మండలంలో 47.2 మి.మీ, ఓడీ చెరువు మండలంలో 45.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. అలాగే తాడిమర్రి 39.2 మి.మీ, నల్లచెరువు 34.2, కదిరి 31.2, గోరంట్ల 22.4, బుక్కపట్నం 22, ముదిగుబ్బ 20.4, గాండ్లపెంట 20, తనకల్లు 18.8, ధర్మవరం 18.2, తలుపుల 15.4, ఎన్‌పీకుంట 14.2, చిలమత్తూరు 9.4, అమడగూరు 5.4, పుట్టపర్తి 3.2, కొత్తచెరువు మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైందని వెల్లడించారు.



కరావులపల్లి వద్ద కళకళలాడుతున్న మొక్కజొన్న పంట



పెడపల్లి వద్ద కురుస్తున్న వర్షం

# నాలుగోసారి



రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నేతలు (ఫైల్)

- రామగిరి ఎంపీపీ ఎన్నికకు మళ్లీ నోటిఫికేషన్
- 13న నిర్వహించాలని నిర్ణయించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- పట్టుకోసం పరిటాల కుటుంబం పాకులాట
- ఒక్క ఎంపీటీసీతో ఎంపీపీ స్థానం కైవసానికి పడరాని పాట్లు
- బెదిరింపులు...కిడ్నాప్‌లతో మూడుమార్లు ఎన్నిక వాయిదా

**సాక్షి, టాస్క్‌ఫోర్స్:** టీడీపీ నేతల దౌర్జన్యాలు, దాడులతో ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన రామగిరి ఎంపీపీ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నాలుగోసారి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనెల 13న ఎన్నిక నిర్వహించాలని పేర్కొంది. దీంతో రామగిరి పీఠంపై మరోసారి చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఎలాగైనా సొంత మండలం రామగిరి పీఠాన్ని దక్కించుకోవాలని పరిటాల కుటుంబం పడరాని పాట్లు పడుతోంది.

**గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ హవా**
రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలుండగా... గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించింది. పేరూరు– 1, పేరూరు– 2, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి, మాదాపురం, రామగిరి ...ఇలా 9 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయ కేతనం ఎగురవేశారు. కేవలం నసనకోట స్థానాన్ని మాత్రం టీడీపీ దక్కించుకోగలిగింది.

**తొలిసారి పీఠం వైఎస్సార్ సీపీ కైవసం**
రామగిరి మండలం కొన్నేళ్లుగా పరిటాల కనుసన్నల్లో ఉండేది. అయితే రాష్ట్రంలో వైఎస్ జగన్ నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ఫ్యాన్‌గాలి వీయగా.. రామగిరిని కూడా వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని ఇళ్లపై వైఎస్సార్ సీపీ జెండాలు ఎగిరాయి. రామగిరి ఎంపీపీ స్థానాన్ని ప్రభుత్వం అన్‌రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించడంతో రామగిరి ఎంపీటీసీ స్థానం నుంచి గెలిచిన మీనుగ నాగమ్మను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఎంపీపీ పీఠంపై కూర్చోబెట్టారు. అయితే ఆమె అనారోగ్యంతో మృతి చెందగా ...రామగిరి ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది.

**దాడులు..దౌర్జన్యాలతో మూడుసార్లు వాయిదా**
రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నేతల దాడులు... దౌర్జన్యాలు పెరిగిపోయాయి. అధికారం అండతో టీడీపీ నేతలు తమదే పైచేయి కావాలని పంతం పట్టారు. ఈక్రమంలోనే మహిళకు రిజర్వ్ అయిన రామగిరి ఎంపీపీ స్థానంపై కన్నేశారు. ఎలాగైనా కైవసం చేసుకునేందుకు ప్రయత్నించారు. కానీ తమ పార్టీ నుంచి ఒకే ఒక పురుషుడు ఎంపీటీసీగా గెలిపొందిన నేపథ్యంలో దౌర్జన్యాలకు తెర తీశారు.

- ఎంపీపీ మీనుగ నాగమ్మ మృతి నేపథ్యంలో మార్చి 27న ఎంపీపీ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో పరిటాల కుటుంబం ఎలాగైనా తన సొంత మండలం రామగిరి పీఠం దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నించింది. కేవలం ఒక్క ఎంపీటీసీ స్థానంతోనే పీఠంపై జెండా ఎగురవేయాలని కుట్ర చేసింది. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన పేరూరు–1, మాదాపురం ఎంపీటీసీ సభ్యులకు టీడీపీ నేతలు తమ పచ్చ కండువాలు కప్పి తమవైపునకు తిప్పుకున్నారు. పార్టీ ఫిరాయింపును తప్పుపడుతూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు ఎన్నికను బహిష్కరించగా... తొలిసారి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది.
- మే 18న రెండోసారి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వగా.. పేరూరు–2 ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఘర్షణ వాతావరణం చేటుచేసుకోగా, ఎన్నిక సమయానికి ఎంపీటీసీ సభ్యులు రామగిరి చేరుకోలేకపోయారు. దీంతో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికకు ఒకరోజు ముందు మే 17వ తేదీన అనెక్షర్ లెటర్ ఇవ్వడానికి రామగిరికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు పేరూరు కురుబ నాగిరెడ్డి, హరినాథ్ రెడ్డి, బోయ రామాంజినేయులపై దాడులు చేశారు. అంతేకాకుండా వారి వాహనాన్ని ధ్వంసం చేశారు.
- మూడోసారి జూలై 16న రామగిరి ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని భావించినా...ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు ప్రకటించారు. దీంతో నాల్గోసారి ఈనెల 13న రామగిరి ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.



రామగిరిలో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడటంతో బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నేతలు(ఫైల్)

**ఒక్క అభ్యర్థితో పీఠం కోసం టీడీపీ పాకులాట**

రామగిరి ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్ అయ్యింది. టీడీపీ తరఫున గెలిచింది ఒకే ఒక ఎంపీటీసీ...పైగా మహిళ కాదు. అయినప్పటికీ పరిటాల కుటుంబం రామగిరి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నించి ఇప్పటికి మూడుసార్లు భంగపడింది. తాజాగా ఈనెల 13న జరిగే ఎన్నికలో ఎలాగైనా విజయం సాధించేందుకు కుట్రలు చేస్తోంది. అయితే ప్రస్తుతం టీడీపీ వైపు నిలిచిన ముగ్గురు ఎంపీటీసీలూ పురుషులే కాగా, మహిళా స్థానం ఎలా దక్కించుకుంటారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



హిందూపురంలోని రాఖీ విక్రయ కేంద్రం వద్ద సందడి

## నేడు 'రాఖీ'

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతకు సాక్షిగా అజేయంగా వర్ధిల్లుతున్న సంబరం రానే వచ్చింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రాఖీ పండుగను వేడుకగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. దీంతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రాఖీ విక్రయాలు ఊపందుకున్నాయి. అలాగే శ్రావణ పౌర్ణమి నాడు హయగ్రీవ జయంతి, సత్యదేవుని వ్రతం, జంధ్యాల పౌర్ణమి, సంస్కృత దినోత్సవాన్ని కూడా వేడుకగా జరుపుకోనున్నారు.

– పుట్టపర్తి టౌన్/హిందూపురం:




హిందూపురం మార్కెట్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



పుట్టపర్తిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

పట్టు పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. పట్టు రైతుల సమస్యలను గాలికి వదిలేసింది. గత ప్రభుత్వం పట్టు రైతులకు అందించిన ప్రోత్సాహకాలు నిలిచిపోయాయి. ఎన్నికల ప్రచార సమయంలో పట్టు రైతులను ఆదుకుంటామని కూటమి పెద్దలు స్పష్టమైన హామీనిచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత హామీ అమలు ఊసే లేకుండా పోవడంతో పట్టు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో నలిగిపోతున్నారు. అయితే ప్రభుత్వం కరుణించకపోయినా.. మార్కెట్ మాత్రం అత్యవసర సమయంలో పట్టు రైతులను ఆదుకుంది. మార్కెట్‌లో కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.700కు పైగా చేరుకుంది.



హిందూపురం మార్కెట్‌లో విక్రయానికి తీసుకువచ్చిన బైవోల్టిన్ పట్టుగూళ్లు (ఫైల్)

# పట్టు వీడని సర్కార్ నిర్దయ

- పట్టు రైతులకు అందని ప్రోత్సాహకం
- అత్యవసర సమయంలో ఆదుకున్న మార్కెట్
- రూ.700 దాటిన కిలో బైవోల్టిన్ పట్టు గూళ్ల ధర
- మూడు రోజులుగా ధరల నిలకడ

**మడకశిర:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పట్టు రైతులకు ప్రోత్సాహక ధనం అందడం లేదు. ప్రభుత్వ పట్టు మార్కెట్లలో అమ్మిన బైవోల్టిన్ పట్టుగూళ్లు ప్రతి కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహక ధనం అందాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పట్టు రైతులకు పైసా కూడా ప్రోత్సాహక ధనం అందలేదు. పట్టు రైతులను ఆదుకోవాలని, ప్రోత్సాహక ధనం అందించాలంటూ పట్టు రైతులు పలుమార్లు విజయవాడకు వెళ్లి ధర్నాలు చేపట్టారు. అయినా ప్రభుత్వంలో చలనం రాలేదు. రూ.కోట్లల్లో ప్రోత్సాహక ధనం బకాయిలు పేరుకుపోవడంతో పట్టు రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**కరుణించిన 'మార్కెట్'**

పట్టు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తూ వచ్చినా... అత్యవసర సమయంలో మార్కెట్ కరుణించింది. దీంతో పంట సాగుకు చేసిన అప్పుల భారం నుంచి బయటపడతామనే ధైర్యం పట్టు రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు పెరిగాయి. హిందూపురంలోని ప్రభుత్వ పట్టు గూళ్ల మార్కెట్‌లో ఈ నెల 6 నుంచి బైవోల్టిన్ పట్టు గూళ్ల ధర కిలో రూ.700 పైగా పలుకుతోంది. దీంతో జిల్లాలోని పట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత మూడు నెలల్లో ఎన్నడూ రూ.700 మార్క్‌ను దాటలేదు. దీంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని అప్పట్లో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**కర్ణాటక మార్కెట్‌లోనూ ఆశాజనక ధరలు**

కర్ణాటక మార్కెట్‌లోనూ పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కర్ణాటక ప్రాంతంలో రామనగర, శిడ్లగట్ట, చింతామణిలోని పట్టు గూళ్ల మార్కెట్లు ప్రధానమైనవి. జిల్లాలో గిట్టుబాటు ధరలేని సమయంలో సరిహద్దున ఉన్న మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాలోని పలువురు రైతులు తమ పట్టు గూళ్లను కర్ణాటకలోని మార్కెట్‌లకు తరలించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్‌లోనూ కిలో పట్టుగూళ్ల ధర రూ.700 మార్క్ దాటింది. ముఖ్యంగా రామనగర మార్కెట్‌లో ఈ నెల 6న కిలో పట్టు గూళ్లు రూ.811 ధర పలకడం విశేషం.

**పెరిగిన పట్టుగూళ్ల ఉత్పత్తి**

కొన్ని రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జిల్లాలో పట్టుగూళ్ల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. హిందూపురం మార్కెట్‌కు ఈ నెల 6న 2,431 కిలోలు, 7న 2,112 కిలోలు, 8న 3,641 కిలోల బైవోల్టిన్ పట్టుగూళ్లను విక్రయానికి రైతులు తీసుకెళ్లారు. అలాగే కర్ణాటకలోని రామనగర మార్కెట్‌కూ భారీగా బైవోల్టిన్ పట్టుగూళ్లు చేరుతున్నాయి. అమ్మకానికి ఈ నెల 6న 22,173 కిలోలు, 7న 29,913 కిలోలు, 8న 24,590 కిలోల బైవోల్టిన్ పట్టుగూళ్లు అమ్మకానికి వచ్చినట్లు అక్కడి అధికారులు తెలిపారు.

**గత మూడు రోజులుగా హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు**

| తేదీ | కనిష్టం (కిలో) | గరిష్టం (కిలో) |
|---|---|---|
| 6న | రూ.540 | రూ.763 |
| 7న | రూ.551 | రూ.760 |
| 8న | రూ.480 | రూ.745 |

**కర్ణాటకలోని రామనగర్ మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు**

| తేదీ | కనిష్టం (కిలో) | గరిష్టం (కిలో) |
|---|---|---|
| 6న | రూ.471 | రూ.811 |
| 7న | రూ.412 | రూ.793 |
| 8న | రూ.400 | రూ.789 |

### ధర పెరగడంతో బయటపడ్డాం



రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టు గూళ్ల ధరలు పెరగడంతో కష్టాల నుంచి బయటపడినట్లైంది. లేకపోతే పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ధరలు నిలకడగా ఉండాలని కోరుకుంటున్నాం.

– సోమ్‌కుమార్, పట్టు రైతు, మడకశిర

### ప్రోత్సాహక ధనం అందించాలి



బైవోల్టిన్ పట్టు రైతులకు ప్రోత్సాహక ధనం అందలేదు. రూ.కోట్లల్లో ప్రోత్సాహక ధనం అందాల్సి ఉంది. ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా ఫలితం ఉండదు. రైతుల బాగోగులను కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పట్టు రైతులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– వేమారెడ్డి, పట్టు రైతు, పాపసానిపల్లి, మడకశిర మండలం

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే హత్య

- వ్యక్తి హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

**హిందూపురం:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడు అతని స్నేహితులతో కలిసి భర్తను హతమార్చిన భార్యను పోలీసులు అరెస్ట్ చేశారు. హిందూపురం రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను లేపాక్షి ఎస్ఐ నరేంద్రతో కలసి సీఐ జనార్దన్ వెల్లడించారు. హిందూపురంలోని త్యాగరాజనగర్‌కు చెందిన దాదాపీర్ (28) వెల్డింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. 11 ఏళ్ల క్రితం పరిగి గ్రామానికి చెందిన దిల్షాద్‌తో పరిచయమైంది. అప్పటికే భర్త నుంచి విడిపోయిన దిల్షాద్‌తో దాదాపీర్ సహజీవనం సాగిస్తూ కొన్ని రోజుల తర్వాత పెళ్లి చేసుకుని త్యాగరాజు నగర్‌కు మకాం మార్చాడు. కాగా, దాదాపీర్ స్నేహితులు పవన్‌కుమార్, నరసింహ, ఇనాయతుల్లా, అఫ్రిది చెడు వ్యసనాలకు బానిసగా మారి, తమ జల్సాలు తీర్చుకునేందుకు చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో స్నేహితులతో కలసి దాదాపీర్ తరచూ మద్యం పార్టీలకు హాజరయ్యేవాడు. ఇలా పార్టీల కోసం స్నేహితులు అప్పుడప్పుడు దాదాపీర్ ఇంటికి వచ్చిపోయే క్రమంలో దిల్షాద్‌తో పవన్‌కుమార్ సన్నిహితం పెంచుకుని వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం దాదాపీర్‌కు తెలియడంతో ఇద్దరినీ మందలించాడు. పద్ధతి మార్చుకోకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించాడు. దీంతో తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న దాదాపీర్‌ను అడ్డు తొలగించుకోవాలని దిల్షాద్, పవన్‌కుమార్ నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని తన స్నేహితులు నరసింహ, ఇనాయతుల్లా, అఫ్రిదితో చర్చించి సాయం చేయాలని పవన్‌కుమార్ కోరాడు. అనంతరం అందరూ కలసి కుట్రపన్ని ఈ నెల 2న మద్యం పార్టీ పేరుతో దాదాపీర్‌ను పిలుచుకెళ్లి హతమార్చారు. ఘటనపై హతుడి తల్లి రహమతున్నీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హిందూపురం రూరల్ పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం దిల్షాద్, పవన్‌కుమార్, నరసింహ, ఇనాయతుల్లా, అఫ్రిదిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తి, రాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



## వరి నాట్లు వేసి నిరసన

**ఓడీచెరువు:** మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వర్షపు నీటితో మడులను తలపిస్తున్నాయంటూ వరి నాట్లు వేసి రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. ప్రధాన రహదారిపై వైఎస్సార్ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకూ రహదారి మొత్తం గుంతలమయమై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచింది. పాదచారులు, ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదంటూ ఈ సందర్భంగా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏడాదిగా ఇదే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, రైతు సంఘం నాయకులు రామచంద్ర, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



నడిరోడ్డుపై వరినాట్లు వేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

## యువతి ఆత్మహత్యాయత్నం

**కదిరి టౌన్:** పట్టణంలోని షామీరియా వీధికి చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. నాలుగేళ్లగా తన బంధువు నూర్ మహమ్మద్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. తనను నమ్మించి బలవంతం చేసి శారీరక అవసరాలు తీర్చుకున్నాడని, పెళ్లి చేసుకోవాలని కోరితే నిరాకరించడమే కాక బెదిరింపులకు దిగడంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మోతాదుకు మించి నిద్ర మాత్రలు మిగింద న్నారు.

గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

## సూపర్ స్పెషాలిటీలో న్యూరో అత్యవసర సేవలు

**అనంతపురం మెడికల్:** జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి న్యూరో విభాగానికి సంబంధించి అత్యవసర (ఎమర్జెన్సీ) సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరికైనా తల, వెన్నెముకకు గాయమైతే 108 నేరుగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లవచ్చని పేర్కొన్నారు. న్యూరో విభాగానికి సంబంధించి ఆపరేషన్ థియేటర్, ఐసీయూతో పాటు అపార అనుభవం కలిగిన న్యూరో సర్జన్లు, నలుగురు పీజీ విద్యార్థులు అందుబాటులో ఉంటారని వివరించారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



**గోరంట్ల:** మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఉన్న పొలంలో చెట్టుకు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సుమారు 45 ఏళ్లు ఉంటాయని అంచనా వేశారు. కుడిచేతిపై 'అమ్మ' అని పచ్చబొట్టు ఉంది. నీలం రంగు గీతల షర్ట్ ధరించాడు. టవాల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించి, కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు గోరంట్ల పోలీసులను సంప్రదించాలని సీఐ శేఖర్ కోరారు.

## బొలికొండ రంగనాథుడి కల్యాణోత్సవం నేడు

**గుత్తి రూరల్:** మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి కల్యాణోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ శోభ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఏటా కల్యాణోత్సవాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ శనివారం ఉదయం 11 నుంచి 12.05 గంటల్లోపు వేడుక నిర్వహణకు అర్చకులు ముహూర్తం నిర్ణయించారు.

## ఒంటరి జీవితాన్ని తాళలేక బలవన్మరణం

**అనంతపురం సిటీ:** ఒంటరి జీవితాన్ని తాళలేని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరుకు చెందిన ఆర్.శివప్రసాద్(21) తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఉన్న ఒక్కగానొక్క అక్కకు పెళ్లి జరిగి అత్తారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శివప్రసాద్ ఒంటరిగానే ఉంటున్నాడు. పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు ఐస్‌క్రీములు సరఫరా చేస్తూ జీవనం సాగించేవాడు. తరచూ తల్లిదండ్రులు గుర్తుకు రావడం.. అక్క ప్రేమాభిమానులు దూరం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న శివప్రసాద్.. గురువారం రాత్రి అనంతపురం–తాటిచెర్ల రైల్వే మార్గంలో పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ నుంచి సమాచారం అందుకున్న అనంతపురం జీఆర్‌పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ దామోదర్... శుక్రవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. కాగా, తొలుత గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, దర్యాప్తులో మృతుడిని శివప్రసాద్‌గా గుర్తించారు. విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు తెలపడంతో వారు మార్చురీకి చేరుకుని నిర్ధారించారు.

## ఖాతాల్లో నగదు మాయం

**సోమందేపల్లి:** స్థానిక సప్తగిరి కాలనీకి చెందిన వాసు బ్యాంక్ ఖాతాలోని రూ.20,500 నగదును సైబర్ నేరగాళ్లు అపహరించారు. కెనరాబ్యాంక్‌లో ఉన్న తన ఖాతా నుంచి నగదును బుధవారం రాత్రి ఇతరుల అకౌంట్‌కు బదిలీ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చినట్లు శుక్రవారం పుట్టపర్తిలోని సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

## నేటి నుంచి పలు రైళ్లు రద్దు

**ముదిగుబ్బ:** సాంకేతిక సమస్యలతో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) మణికుమార్ శుక్రవారం ఒక పత్రికలో తెలిపారు. గుంతకల్లు–తిరుపతి,(57404), తిరుపతి–కదిరిదేవరపల్లి (57404), భాగల్ కోట్–మైసూర్(17308) రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## ఓట్ల గల్లంతు వెనుక ఎన్డీఏ హస్తం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

**ధర్మవరం:** బిహార్‌లో ఓట్ల గల్లంతు వెనుక కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ హస్తముందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ఓట్ల గల్లంతు విషయంగా ధర్మవరంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిహార్‌లో ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో దాదాపు 80 లక్షల మంది ఓట్లు గల్లంతయ్యాయని, ఇందులో ఎక్కువగా బడుగు బలహీన వర్గాలు, బీసీలు, మైనార్టీలు, వలస వెళ్లిన ప్రజలు ఉన్నారన్నారు. ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఓట్లు నమోదవుతాయనే అనుమానంతోనే అర్హులైన ఓటర్లను సైతం జాబితా నుంచి తొలగించారని విమర్శించారు. తొలగించిన ఓటర్లకు సంబంధించిన వివరాలను అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఎన్నికల కమిషన్ స్పందించకుండా సమయం సరిపోదని తెలపడం వెనుక పూర్తిగా అధికార పార్టీ హస్తముందనేది స్పష్టమవుతోందన్నారు. ఇలాంటి విధానాలను ఎన్డీఏ ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. నిరసనలో సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, వెంకటేష్, శ్రీనివాసులు, దిల్షాద్, లక్ష్మీనారాయణ, మారుతి, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఎల్.ఆదినారాయణ, వెంకటస్వామి, మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు